క్లుప్తంగా

వాహనాలు తనిఖీ

వేమనపల్లి: ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో గ్రామాల్లో తనిఖీలు చేపడుతున్నారు. నీల్వాయి ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నీల్వాయి, వేమనపల్లి ప్రధాన రహదారులపై వాహనాల తనిఖీ చేపట్టారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు కనబడితే వారి ఆధార్‌కార్డు, ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించారు. పోటీ చేసే అభ్యర్థుల తరఫున మందు, డబ్బు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందునా వాహనాల సోదాలు నిర్వహించారు.

చదువుకున్న పాఠశాలకు రూ.2.50 లక్షల విరాళం

జన్నారం: తాను చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలని భావించిన పూర్వ విద్యార్థి పాఠశాల వంటశాలకు, స్టేజీ కోసం రూ.2.50లక్షలు విరాళంగా అందజేసి ఉదారత చాటాడు. జన్నారం మండలం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1992–93బ్యాచ్‌లో పదో తరగతి చదివిన మల్యాల బాపన్న, వసంతల కుమారుడు వేణుగోపాల్ ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డాడు. సొంత గ్రామానికి వచ్చిన ఆయన బుధవారం పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో వంటగది, స్టేజీ లేకపోవడంతో వాటి నిర్మాణానికి తాను విరాళం అందజేస్తున్నట్లు ఉపాధ్యాయులకు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కు భూమేశ్, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌ను అభినందించారు.

ముగిసిన ఎన్నికల శిక్షణ తరగతులు

చెన్నూర్: శిక్షణ పొందిన అధికారులు ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని చెన్నూర్ ఎన్నికల అధికారి సిడాం దత్తు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ యంత్రాల పనితీరు సంపూర్ణ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు చంద్రశేఖర్, విశ్వంభర్, మల్లికార్జున్, మాస్టర్ ట్రైనర్స్ గుండెటి యోగేశ్వర్, ఎస్. శ్రీనివాస్, దేత్తమూర్తి, కృష్ణమూర్తి, నరేందర్, శ్రీనివాస్, శ్రీమూర్తి, షారీక్, నారాయణ, సురేందర్ పాల్గొన్నారు.

శ్రీహర్ష కళాశాలలో ఫుడ్‌ఫెస్టివల్

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ విద్యార్థులు బుధవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. వివిధ వంటకాలతో విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే ఆహార పదార్థాలను, పండ్లు కూరగాయలను తీసుకోవాలన్నారు. రసాయన మందుల్లేని చక్కటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వంటకాల ద్వారా తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సాత్వికమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్ రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిత ఠాకూర్, ఫుడ్స్ సైన్స్ లెక్చరర్ శ్రావణి, రజిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రాజెక్టర్ల మరమ్మతులకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని సర్కారుబడులకు పంపిణీ చేసిన కేయాన్ కంప్యూటర్ కమ్ ప్రాజెక్టర్లకు సాంకేతిక లోపంతో(టెక్నికల్ ప్రాబ్లమ్) ఇబ్బందులుంటే ఈ నెల 24న మరమ్మతు చేయనున్నట్లు సెక్టోరల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెలాఖారుకు కేయాన్ సంస్థ పంపిణీ పరికరాల ఒప్పందం ముగియనుండటంతో రిపేర్లు ఉంటే కంప్యూటర్‌తో పాటు ప్రాజెక్టర్లను డీఈవో కార్యాలయానికి తీసుకురావాలన్నారు. ఈ నెల 24న ఒక్కరోజు మాత్రమే టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని సూచించారు.

వరిలో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు వరి పంటలో నాణ్యతా ప్రమాణాల గురించి అవగాహన కల్పించారు. పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. రైతులు సేంద్రీయ పద్ధతులలో పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సాగర్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెల్లంపల్లిరూరల్: రైతులు వరిధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని, ఐకేపీ ద్వారా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం శ్యామల, మండల వ్యవసాయాధికారి వందన అన్నారు. బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు కొనుగోలు కేంద్రాల్లోనే మంచి గిట్టుబాటు ధర అందుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

కెరమెరి: ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే వారికే ఈ ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రభుత్వ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

జంగ్ తెలంగాణ

ఉద్యోగులకు న్యాయం చేయాలి



ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేసే వారికే ఈ ఎన్నికల్లో మద్దతిస్తాం. చాలా కాలంగా వివిధ సమస్యలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

- కె.మురళి, టీచర్, గోయగాం

విద్యారంగంపై దృష్టి సారించాలి



విద్యారంగంపై దృష్టి సారించే వారికే ఈ ఎన్నికల్లో ఓటు వేస్తాను. విద్యాభివృద్ధికి పాటు పడే వారు వస్తే విద్యార్థులకు ఎంతో శ్రేయస్కరంగా ఉంటుంది.

- గణేశ్, టీచర్, గోయగాం

సమస్యలపై అవగాహన ఉండాలి



ఒక్క బడుల గురించే కాకుండా, గ్రామాల్లో ఉండే ప్రధాన సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వారికే మద్దతిస్తాను. అలాంటి వారితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

- కదేర్ల రంగయ్య, టీచర్, సావర్‌ఖెడా

ప్రజలతో మమేకమై ఉండాలి



ప్రజలతో మమేకమై ఉన్న నాయకుడు ఉంటే ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా వివరించే అవకాశం ఉంటుంది. ప్రజల మనిషిగా ఉండి, వెంటనే స్పందించే గుణం ఉండాలి.

- పి.ప్రవీణ్, టీచర్, గోయగాం

'ఓటు' కోసం తప్పని నడక

- కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రాలు
- రవాణా సౌకర్యం లేక ఓటర్ల తిప్పలు
- ఓటింగ్ శాతంపై ప్రభావం



గోలేటి పంచాయతీ పరిధిలోకి వచ్చే దేవులగూడలోని కొంత భాగం

రెబ్బెన: రోజురోజుకు దేశ జనాభా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు మాత్రం ఏర్పడటం లేదు. నేటికీ ఆవాస ప్రాంతాల ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవడానికి కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేసే అధికారులు, పోలింగ్ కేంద్రాలకు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ఓటర్లను తీసుకొచ్చేందుకు మాత్రం ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదు.

మండలంలో 37 పోలింగ్ కేంద్రాలు

మండలంలో గతంలో 12 గ్రామ పంచాయతీలు మాత్రమే ఉండగా పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం మరో 12 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. మండలంలో మొత్తం 36 ఆవాస గ్రామాలు ఉండగా వాటి పరిధిలో 37 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు ఎన్నిసార్లు జరిగినా ఓటర్లు మాత్రం ఓటు వేసేందుకు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తుంది. ముఖ్యంగా ఆవాస ప్రాంతాల ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటంతో ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఇబ్బందులు తప్పడం లేదు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులకు, వృద్ధులకు రవాణా సౌకర్యం కల్పించే అధికారులు మిగిలిన ఓటర్ల కోసం ఎలాంటి రవాణా సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో తమ విలువైన ఓటుహక్కును వినియోగించుకునేందుకు అనేక తిప్పలు పడుతున్నారు. కాగా ఆయా గ్రామస్తులకు అందుబాటులో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘం నిబంధనలు ప్రతిబంధకంగా మారుతున్నాయి. పోలింగ్ కేంద్రం పరిధిలో 1500 మంది ఓటర్లు పైబడి ఉన్నప్పుడే కొత్త కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. దీంతో మండలంలో ఈసారి కొత్తగా ఒక్క పోలింగ్ కేంద్రం కూడా ఏర్పాటు కాలేదు. కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు కొంత మంది ఓటర్లు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ఆవాస ప్రాంతాల్లో ఓటింగ్ శాతంపై ప్రభావం పడుతోంది.

ఆవాస గ్రామాల పరిస్థితి ఇలా..

మండలంలో అనేక గ్రామాలు పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. మండలంలోని కైరిగూడ, కైరిగూడ తండా గ్రామాల ఓటర్ల కోసం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. ఈ గ్రామాల ప్రజలు పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలంటే 2.5 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. సోనాపూర్ గ్రామ ఓటర్లు 4 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఇక దేవులగూడ గ్రామస్తుల పరిస్థితి మరోలా ఉంది. ఈ గ్రామంలోని కొంత భాగం గంగాపూర్ గ్రామ పంచాయతీలో, మిగిలిన భాగం గోలేటి గ్రామ పంచాయతీలో ఉంటుంది. దీంతో గ్రామంలోని కొంత మంది ఓటర్లు గోలేటి విలేజ్‌లోని పోలింగ్ కేంద్రంలో, మిగిలిన ఓటర్లు గంగాపూర్‌లోని పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వెళ్లాల్సి ఉంటుంది. దేవులగూడ నుంచి గోలేటి విలేజ్ 4 కిలోమీటర్లు ఉండగా, గంగాపూర్ 4.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని పైకాజీగూడ గ్రామస్తుల కోసం పోలింగ్ కేంద్రాన్ని నారాయణపూర్ ప్రభుత్వ పాఠశాలలో కేటాయించగా, పైకాజీగూడ గ్రామం నుంచి పోలింగ్ కేంద్రం సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి ప్రైవేటు వాహనాల సౌకర్యం కూడా లేకపోవటంతో ఓటర్లు కాలినడకనే వచ్చి ఓటు వేయాల్సిన పరిస్థితి. రంగాపూర్, సన్యాసికుంట, కొత్తగూడ(టి) ఆవాస గ్రామాలకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు లేకపోవడంతో పక్కన ఉన్న గ్రామాలకు వెళ్లి ఓటు వేయాల్సి ఉంది.

కొత్త పోలింగ్ కేంద్రాలు లేవు

ఎలక్షన్ కమిషన్ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్న ఓటర్ల ఆధారంగా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. ఒక్కో పోలింగ్ స్టేషన్ పరిధిలో 1500 మంది ఓటర్లు మించితేనే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. ఈసారి మండలంలో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కాలేదు. అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

- వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్

ఆలయాల్లో భక్తుల కిటకిట!

- నేడు ప్రభోదిని ఏకాదశి



శివాలయంలో హారతులిస్తున్న భక్తులు

కెరమెరి: కార్తీక మాసం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మహిళలు, పురుషులు, చిన్నారులు అనే తారతమ్యం లేకుండా ఆలయాలకు వచ్చి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కార్తీకమాస ఘట్టంలో గురువారం నిర్వహించనున్న ప్రభోదిని ఏకాదశికి ఎంతో విశిష్టత ఉంది. నేడు ఉపవాసం ఉంటే సకల కార్యాలు నెరవేరుతాయని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక శుద్ధ ఏకాదశిని ప్రభోదిని ఏకాదశిగా పిలుస్తారు. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున పాల కడలిలో గాఢనిద్రకు ఉపక్రమించిన మహావిష్ణువు కార్తీక ఏకాదశిన మేల్కొంటాడని పురాణాలు చెబుతున్నాయి. ఏకాదశి నాడు ప్రారంభమైన చతుర్మాస్యవ్రతం ఈ ఏకాదశితో ముగుస్తుంది. మహాభారత యుద్ధంలో భీష్ముడు ఈ ఏకాదశినాడే అస్త్ర సన్యాసం చేసి అంపశయ్యమీద శయనించాడని చెబుతుంటారు. ప్రభోధిని ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువుకు హారతి ఇచ్చిన వారికి అపమృత్యు దోషం తొలిగిపోతుందని, ఈరోజు ఉపవాసం ఉన్నవారికి ధాన్యం, సంపదలు ఉన్నత స్థానంతో పాటు పాప పరిహారం జరుగుతుందని భక్తుల నమ్మకం. ఏకాదశి రోజున పేదలకు వస్త్రదానం, పండ్ల దానం చేయాలని పురాణ కథలు చెబుతున్నాయి.

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న టి. రోసిరెడ్డి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సివిల్ సర్వీసెస్ పరీక్షలపై కళాశాలలోని కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయవాది, కెరీర్ అడ్వైజర్ టి. రోసిరెడ్డి మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ దేశంలోనే అత్యున్నత ఉద్యోగమన్నారు. సివిల్స్‌కు సిద్ధమవుతున్న డిగ్రీ విద్యార్థులు సమాజం, సంస్కృతిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల గ్రంథాలయానికి వివిధ పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు.

మహిళల రక్షణ కోసమే షీ టీంలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఇన్‌చార్జి సునీత

రెబ్బెన: బాలికల, మహిళల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు షీ టీం సేవలు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు, విద్యార్థులు షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100కు కాల్ చేసి సత్వర సహాయం పొందవచ్చని తెలిపారు. మహిళలు, బాలికల రక్షణ ధ్యేయంగా షీటీంలు పని చేస్తున్నాయన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు కల్పించిన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయరాణి, షీటీం సభ్యులు స్వప్న, శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీటీరోడ్డు వేయరూ..!



కెరమెరి: మండలంలోని సావర్‌ఖెడా గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు రాళ్లు, రప్పలతో నిండి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బీటీ రోడ్డు మంజూరు అయినప్పటికీ రిజర్వుడ్ ఫారెస్టులో ఉండడంతో అటవీ అధికారులు పనులు నిలిపివేశారు. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

చింతలమానెపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం సమావేశం నిర్వహించాల్సి ఉండగా మండల అధ్యక్షుడు సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి సమావేశం వివరాలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

నేడు 2కే రన్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో స్వేరోస్ నెట్‌వర్క్, ఫిట్ ఇండియా ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ దివస్ వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు స్థానిక బస్టాండ్ నుంచి 2కే రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రన్‌లో పాల్గొనే వారికి టీషర్ట్ లు ఉచితంగా పంపిణీ చేస్తామని, రన్‌లో విజేతలుగా నిలిచే వారికి ప్రైజ్ మనీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగింత

వాంకిడి: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి బుధవారం బాధితుడికి ఎస్సై సాగర్ అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లంజన్‌వీర గ్రామానికి చెందిన బెండారే విజయ్ రూ.17 వేలు విలువ గల తన మొబైల్ ఫోన్ 10 రోజుల క్రితం జిల్లా కేంద్రంలో ఓ పార్టీకి సంబంధించిన సభలో పోగొట్టుకున్నాడు. అతని ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి తిరిగి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంజిరిలో వైద్య శిబిరం

నార్నూర్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని మంజిరిలో వైద్య శిబిరం నిర్వహించారు. 25 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోషకాహార మేళా



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు సతీష్



పోషకాహారాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ: ఇచ్చోడలోని వివేకానంద హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పోషకాహార మేళా ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ రకాల పోషకాహారాలను ప్రదర్శించారు. ఇచ్చోడ పీహెచ్‌సీ డాక్టర్ సాగర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఏది తినాలి, ఏది తినకూడదో అన్న విషయం పట్ల విద్యార్థులకు పూర్తి అవగాహన ఉందన్నారు. బ్యాలెన్స్‌డ్ డైట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి ఆహార పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిఖిని వర్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు చిలక సతీష్ విద్యార్థులకు వినూత్నంగా పాఠాలు బోధిస్తున్నాడు. బుధవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. విద్యార్థులే కేంద్రీకృతంగా పోషకాహారం ఉన్న పదార్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పోశెట్టి, ప్రధానోపాధ్యాయులు రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీగోవిందమాంబ సమేత మద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా ఉత్సవమూర్తి విగ్రహాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో ఆలయం నుంచి గోదావరి తీరం వరకు ర్యాలీ తీశారు.మహిళల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. బుధవారం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం, సర్వతోభద్రమండలి అలంకరణ, కలశ ప్రతిష్ఠ, అఖండ దీప ప్రజ్వలన, గణపతి హోమం అనంతరం గోదావరి వద్ద ఉత్సవ మూర్తి విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అర్చకులు ప్రసాద్‌శాస్త్రి, హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు కొనసాగాయి.

కరపత్రాల ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బేల్లూరి అయ్యప్ప ఆలయంలో ఈనెల 26న ప్రారంభించనున్న ఆరట్టు మహోత్సవం కరపత్రాలను బుధవారం ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజి సూర్యకాంత్, దాముక రవీందర్‌లు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహం పల్లకి సేవలో ఊరేగింపుగా యోగానంద సరస్వతిచే ఆరట్టు మహోత్సవ పూజ ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక సభ్యులు తాటిపెల్లి శివప్రసాద్, ఆలయ తంత్రి సాయికృష్ణ దుబే, ఈర్ల సత్యనారాయణ, చంద గణేశ్, టీంగం నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

కుంటాల: ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని.. సకాలంలో గమ్యస్థానాలకు చేరుతామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేకే రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు రూపొందించిన గమ్యం యాప్‌పై అవగాహన కల్పించారు.

అమరవీరులకు నివాళులు

ఇంద్రవెల్లి: మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం ఓయూ జేఏసీ కన్వీనర్ వెంకట్ రెడ్డి, నిరుద్యోగ యాత్ర సభ్యులు నివాళులర్పించారు. ఆదిలాబాద్ నుంచి ఖానాపూర్‌కు వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో అమరవీరుల స్తూపం వద్ద ఆగి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిరుద్యోగ యాత్ర కోఆర్డినేటర్ స్వామి, యాత్ర ఇన్‌చార్జి సురేశ్, 22 మంది సభ్యులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి



ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోయగాంను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కూరగాయలను ఎక్కువసార్లు కడిగి వండాలన్నారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, టీచర్లు గణేశ్, మురళి, ప్రవీణ్ ఉన్నారు.